సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 27 | సెప్టెంబర్ | 2025



వెండి హస్తాల సమర్పణ

సఖినేటిపల్లి: గ్రామంలో వెలసిన కనకదుర్గమ్మ వారికి కనుమూరి రామసీత (సఖినేటిపల్లి) శుక్రవారం రూ.61 వేల విలువైన వెండి హస్తాలు సమర్పించారు.



శఠగోపం బహూకరణ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో ఓనువులమ్మ వారికి గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్, ప్రమీల దంపతులు రూ.లక్ష విలువైన శఠగోపం, రెండు వెండి గిన్నెలు సమర్పించారు.

రూ.లక్ష విరాళం



కొత్తపేట: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి ఉండవల్లి మోహన కార్తిక్, కుటుంబ సభ్యులు (రాజమహేంద్రవరం) రూ.50,116, పసుపులేటి శరత్‌చంద్రబాబు, సుజాత దంపతులు (సికింద్రాబాద్) రూ.50,116 చొప్పున విరాళాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

విజయవాడ ఉత్సవ్‌కు జిల్లా కళాకారులు



విజయవాడ దుర్గమ్మ రథయాత్రలో పాల్గొనే కళాకారులు

కొత్తపేట: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఈ నెల 28న మెగా కార్నివాల్ వాక్‌తో పాటు దుర్గమ్మ ఉత్సవ రథయాత్రలో జిల్లా నుంచి 110 మంది గరగ, వీరనాట్యం కళాకారులు పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన గరగ నృత్యం కళాకారుల బృందం నాయకుడు కొమారిపాటి ఏసువెంకట ప్రసాద్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. శరన్నవరాత్రులు నేపథ్యంలో విజయవాడలో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 30 కళా రూపాలు.. 3 వేల మంది కళాకారులతో 2.8 కిలోమీటర్ల మేర మెగా కార్నివాల్ దుర్గమ్మ ఉత్సవ రథయాత్ర జరుగుతుందన్నారు. తన నేతృత్వంలోని 60 మంది గరగ నృత్యం కళాకారులు, మండపేట మండలం తాపేశ్వరం గ్రామానికి చెందిన కొరివి సత్తిబాబు నేతృత్వంలో 50 మంది వీరనాట్యం కళాకారులు పాల్గొంటున్నట్టు ప్రసాద్ తెలిపారు.

పీపీపీకి వ్యతిరేకంగా 29న ర్యాలీ



ర్యాలీ వివరాలను వెల్లడిస్తున్న కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సమనసలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో నిర్మించడానికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో ప్రజలంతా ఐక్యంగా పాల్గొనాలని ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 29న ఆ వైద్య కళాశాల నుంచి జిల్లా కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్థానిక గొల్లగూడెంలో గల ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో పోరాట కమిటీ ప్రతినిధులు శుక్రవారం సమావేశమయ్యారు. ప్రజా, విద్యార్థి, మహిళా సంఘాలు, వామపక్షాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పీపీపీ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అల్పపీడనంతో అప్రమత్తం

అమలాపురం రూరల్: ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం శుక్రవారం వాయువ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని శనివారం ఉదయం నుంచి అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం జిల్లా స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, డివిజన్ జిల్లా కేంద్రాలలో కంట్రోల్ రూమ్ 24/7 గంటలు పనిచేసేలా సిబ్బందిని నియమించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మరో వైపు గోదావరి నది పరివాహక ప్రాంతాలలో వరద ఉధృతి వల్ల ఈనెల 28వ తేదీ నాటికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద చేరుకుంటుందని, ధవళేశ్వరం దిగువ గోదావరి తీరప్రాంత మండలాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాలకృష్ణ చట్టసభలో ఉండడం రాష్ట్రం దౌర్భాగ్యం



చీకట్ల కిశోర్

ఉప్పలగుప్తం: మతి స్థిమితం సరిగ్గా లేదని గతంలో నాలుగు ఆస్పత్రుల నుంచి సర్టిఫికెట్ పొందిన మానసిక రోగి నందమూరి బాలకృష్ణను ఎమ్మెల్యేగా చట్టసభల్లోకి పంపించడం రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యమని జిల్లా బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు చీకట్ల కిశోర్ అన్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి సైకో అని ప్రస్తావించడానికి ఆయన తన నివాసంలో శుక్రవారం ఖండించారు. విలేకర్లతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ హయాంలో సినిమా పరిశ్రమ సమస్యలను చిరంజీవి నేతృత్వంలో అప్పటి సీఎం జగన్‌కు వివరించడం వల్లే సమస్య పరిష్కారమై టికెట్టు రేట్లు పెరిగాయాన్నారు. తన అన్నను అవమానిస్తూ మాట్లాడుతున్నా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబు ఎటువంటి స్పందనా లేకుండా చంద్రబాబుకు ఊడిగం చేస్తుండడం సిగ్గు చేటని పేర్కొన్నారు. సైకో అన్న విషయాన్ని బాలకృష్ణ వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు.



ఒక రేషన్ షాపు వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న డీలర్



బడుగువానిలంకలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి

స్మార్ట్ పరేషన్!

- డిజిటల్ కార్డుల పంపిణీలో జాప్యం
- తమ కార్డులు ఉన్నాయో లేవోనని లబ్ధిదారుల్లో పెరుగుతున్న సంశయం
- జిల్లాలో 28 శాతం మందికి అందని వైనం

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో ఇంకా కార్డుల విభజన, చేర్పులు, మార్పులు, పిల్లల నమోదు ప్రక్రియ ఇంకా పూర్తిస్థాయిలో కాలేదు. దీనికి తోడు రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అలసత్వం వల్ల లబ్దిదారులకు ఇంకా స్మార్ట్ రేషన్ కార్డులు అందలేదు. దీంతో లబ్దిదారులు తమకు స్మార్ట్ కార్డు మంజూరైందో లేదోనని, కార్డు ఉందా లేక తీసేశారా అని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు స్మార్ట్ కార్డుల బాధ్యతలను స్వీకరించిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది కాని, రేషన్ డీలర్లు కానీ పని భారం ఎక్కువ కావడం వల్ల ఇళ్లకు వెళ్లి ఇవ్వలేకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది. దీంతో పాటు స్మార్ట్ కార్డుల్లో తప్పులు ముద్రణ కావడం, జిల్లా పేరు లేకపోవడం కూడా ప్రజలను సంశయంలోకి నెట్టేస్తున్నాయి. జిల్లాలో 935 రేషన్‌షాపులు ఉండగా అందులో 5.32 లక్షల కార్డులున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంపిణీ చేసిన రేషన్‌కార్డులను స్మార్ట్ రేషన్‌కార్డుల పేరిట మళ్లీ మారుస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఆరో తేదీన ప్రారంభించిన స్మార్ట్ రేషన్‌కార్డుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఈ నెలాఖరు నాటికి స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ పూర్తి చేయాల్సి ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇంటింటికీ పంపిణీ చేయకుండా



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థానంలో తూర్పు గోదావరి జిల్లాగా ముద్రణ జరిగిందని చెబుతున్న లబ్ధిదారుడు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ బాధ్యతను తీసుకున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు, రేషన్ డీలర్లు తమ వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం విపరీతమైన పని ఒత్తిడి పెంచడంతో పాటు సర్వేలు, యాప్‌ల భారం వల్ల కూడా పంపిణీలో వేగం మందగించింది. ఉద్యోగులకు ఖాళీ దొరికిన సమయాల్లోనే వారు ఇంటింటికీ వెళ్లి కార్డులను అందజేస్తున్నారు. రేషన్ డీలర్లు అయితే రేషన్ దుకాణాల వద్దకు వచ్చి తీసుకోవాలని చెబుతున్నారు. ఒక్కొక్కసారి రేషన్‌షాపుల వద్ద కూడా డీలర్ అందుబాటులో ఉండటం లేదని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. రేషన్‌డీలర్లు మాత్రం తాము లబ్దిదారులకు సరకులే పంపిణీ చేయాలా లేక ఇంటింటికి వెళ్లి స్మార్ట్ కార్డులు అందించాలా అని ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్‌కార్డుల పంపిణీ తమ వల్ల కాదని చెప్పినా రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు బలవంతంగా బెదిరించి ఈ పంపిణీ బాధ్యతను అప్పగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 4.16 లక్షల కార్డుల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా ఉన్న 5.32 లక్షల స్మార్ట్ రేషన్‌కార్డులకు ఈ నెల 26వ తేదీ నాటికి 4.16 లక్షల కార్డుల పంపిణీ జరిగింది. అయితే ఈనెల 10వ తేదీ నాటికి 22 శాతం, 15వ తేదీ నాటికి 48 శాతం, 20వ తేదీ నాటికి 63 శాతం మాత్రమే పంపిణీ జరగడం గమనార్హం. అందులో రేషన్ డీలర్లు 3.37 లక్షలు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు 79 వేలు పంపిణీ చేశారు. స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని అనునిత్యం పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పౌరసరఫరాశాఖ ఆదిశగా దృష్టి సారించపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాగే స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీపై విస్తృత ప్రచారం చేసుకున్న కూటమి నేతలు కూడా అందులో జాప్యాన్ని పట్టించుకోవడం లేదని లబ్దిదారులు ఆరోపిస్తున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క కొత్తకార్డు కూడా మంజూరు చేయపోవడంపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమానికి సంబంధించిన అన్ని పథకాలు నేరుగా లబ్ధిదారుల గడప వద్ద వెళ్లి అందించేందుకు గ్రామ వలంటీర్ వ్యవస్థ సన్నద్ధంగా ఉండేది. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, పౌరసేవలను అటకెక్కించింది. గతంలో కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించాల్సి ఉన్నా, ధ్రువపత్రం కావాల్సి ఉన్నా సత్వరమే ఆ ఇంటికి వలంటీర్ వచ్చి దరఖాస్తులను సేకరించేవారు. అనంతరం గడువు లోపల అనుకున్న సమయానికి ఆ సంక్షేమ పథకాల ప్రగతితో పాటు అవసరమైన ధ్రువపత్రాలను అందించే వారు. ఆ గ్రామ వలంటీర్ల బాధ్యతతో పాటు సర్వేలు, యాప్‌ల భారం, హేతుబద్ధీకరణ పేరిట ఉద్యోగులను భారీగా తగ్గించి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

స్మార్ట్ కార్డులు అందలేదు



రేషన్ సరకులను తీసుకునే సౌలభ్యంతో పాటు సంక్షేమ పథకాల కోసం పంపిణీ చేస్తామన్న స్మార్ట్ రేషన్ కార్డులు ఇంకా అందలేదు. గ్రామ, వార్డు సచివాలయానికి వెళితే కార్డు ఇంకా రాలేదంటున్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరులో జాప్యం ఆందోళన కలిగిస్తుంది.

– కె.వెంకటేశ్వరరావు, రామచంద్రపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సర్వేల భారం వల్లే జాప్యం



గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు సర్వేల భారం, యాప్‌ల నిర్వహణతో పాటు ఇతర పనులను అప్పగించడం వల్ల అనుకున్నంత రీతిలో స్మార్ట్‌కార్డుల పంపిణీ సాగడం లేదు. ప్రత్యామ్నాయంగా రేషన్ డీలర్లు కూడా స్మార్ట్‌కార్డులను అందజేస్తున్నారు.

– సీహెచ్ రవివర్మ, గ్రామ సచివాలయ ఉద్యోగి, నల్లూరు, కపిలేశ్వరపురం మండలం

జిల్లా పేరు మార్చాలి



రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పుగా ముద్రించిన జిల్లా పేరును సత్వరమే మార్చాలి. ప్రస్తుతం ఉన్న తూర్పుగోదావరి జిల్లా స్థానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా స్మార్ట్ కార్డులో సవరించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

– తోరాటి లక్ష్మణరావు, ఎంపీపీ, ఆలమూరు

జగన్, చిరంజీవిలపై ఆ వ్యాఖ్యలు సరికాదు

బాలకృష్ణపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం



విజయవాడలో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సినీ నటుడు చిరంజీవిలపై టీడీపీ ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి ఓ ప్రకటనలో బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండించారు. అధికారం శాశ్వతం కాదని, విర్రవీగి మాట్లాడటం మానుకోవాలని బాలకృష్ణకు హితవు పలికారు. బాలకృష్ణ వ్యాఖ్యలను తాను వ్యక్తిగతంగా ఖండిస్తున్నానన్నారు. చిరంజీవి సినీరంగంలో ఓ దిగ్గజమన్నారు. ఆయన వ్యక్తిత్వం ఏమిటో ప్రజలందరికీ తెలుసని, అంతటి వ్యక్తిపై బాలకృష్ణ వ్యాఖ్యలు సిగ్గు చేటు అన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నప్పటికీ బాలకృష్ణకు సభా మర్యాదలు తెలియదా అని ప్రశ్నించారు. సభలో లేని చిరంజీవిపై వ్యాఖ్యానించడం సరికాదన్నారు. చిరంజీవిని మాజీ సీఎం వైఎస్ జగన్ అవమానించారంటూ గతంలో చంద్రబాబు సైతం విమర్శించారని గుర్తు చేశారు. ఆ విషయంలో వాస్తవమెంతో నేడు బాలకృష్ణ వ్యాఖ్యలపై చిరంజీవి విడుదల చేసిన లేఖ చెబుతుందన్నారు. నిర్మాతపై తుపాకీతో కాల్చి, తాను మానసికంగా బాధపడుతున్నానంటూ సర్టిఫికెట్ తెచ్చుకున్న విషయాన్ని బాలకృష్ణ మర్చిపోకూడదన్నారు. ఇతరులను సైకో అనడానికి ముందు బాలకృష్ణ ఈ విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అసెంబ్లీలో చర్చ జరుగుతున్నప్పుడు ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించి ఉంటే ఆయన గౌరవం పెరిగేదన్నారు.

బాలకృష్ణను మెంటల్ ఆస్పత్రిలో చేర్చాలి



కాశి బాలమునికుమారి



కాశి రామకృష్ణ

ముమ్మిడివరం: నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణను వెంటనే మెంటల్ ఆసుపత్రిలో చేర్పించి అతని మానసిక పరిస్థితిపై బులెటిన్ విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కాశి బాలమునికుమారి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గతంలో మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడిన బాలకృష్ణ ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా కుల దుహంకారంతో మాజీ ముఖ్యమంత్రిపై అసభ్యంగా మాట్లాడుతుంటే అతని మానసిక పరిస్థితి బాగోలేదని తెలుస్తోందన్నారు. బాలకృష్ణ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో తన తండ్రిపై చెప్పులతో దాడి చేస్తే మాట్లాడలేని వ్యక్తి నోరు అదుపులో పెట్టుకోక పోతే తీవ్ర పరిస్థితులు ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. తలకు విగ్గు, నోటికి పెగ్గు వేసుకుంటే సరిపోదు.. కాస్త సభ్యత, సంస్కారం ఉండాలని విమర్శించారు.

ఉత్సవాలు సమన్వయంతో నిర్వహించాలి

- కలెక్టర్ మహేష్ కుమార్
- దసరా, చెడీతాలింఖానా ఏడు రోడ్ల ఊరేగింపులపై సమీక్ష

అమలాపురం రూరల్: దసరా, చెడి తాలింఖానా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్, దేవదాయ ధర్మాదాయ శాఖల అధికారులతో ఈ ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించే ఏడు వీధుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మార్గాలలో విద్యుత్ లైన్లు, ఏపీ ఈపీడీసీఎల్, కేబుల్ వైర్లను మున్సిపల్ కమిషనర్లు సరిచేసి ఊరేగింపునకు సహకరించాలన్నారు. అక్టోబర్ రెండో తేదీన నిర్వహించే ఊరేగింపుల సమయాలను పోలీసు సిబ్బంది ఆయా కమిటీల సభ్యులతో సజావుగా నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, ఏడు వీధుల్లోనూ డ్రోన్ కెమెరాల ఏర్పాటు, వాటిని కంట్రోల్ రూంకు అనుసంధాన ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. పెద్ద డీజే శబ్దాలు లేకుండా, బాణసంచా వల్ల ఇబ్బంది లేకుండా అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచాలన్నారు. బోడసకుర్రు ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. అక్టోబర్ 8వ తేదీన అంబాజీపేటలో విజయ బేతాళ స్వామి ఉత్సవానికి శాంతి భద్రలను పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చెడి చెడితాలింఖాన ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ టి.నిశాంతి, డీఆర్ఓ కె.మాధవి ఆర్డీఓలు పి.శ్రీకర్, డి అఖిల, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నానో యూరియాను వినియోగించాలి

జిల్లాలో వరి సాగులో ప్రస్తుతం మూడు దశలలో వినియోగిస్తున్న యూరియా, ఎరువులకు గాను రెండో దశలో వినియోగించే 30 శాతం యూరియాకు బదులు నానో యూరియాను వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. నానో యూరియా వాడితే దిగుబడి మెరుగవుతుందని అర లీటర్ నానో యూరియా బాటిల్ 35 కేజీల సాంప్రదాయ యూరియా బస్తాతో సమానమన్నారు. ధర కూడా తక్కువగా ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఏడీఏ వెంకటరామారావు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

28 నుండి కోనసీమ పుణ్యక్షేత్ర దర్శిని

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టెంపుల్ టూరిజంలో భాగంగా రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 28వ తేదీ ఆదివారం కోనసీమ జిల్లా పుణ్యక్షేత్ర దర్శిని పేరిట 8 పుణ్యక్షేత్రాల దర్శనానికి ఒక ప్యాకేజీ కింద శ్రీకారం చుడుతున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా వాడపల్లి, ర్యాలి, జగన్మోహని కేశవ స్వామి క్షేత్రం, కుండలేశ్వరం, మురమళ్ల, ముక్తేశ్వరం, అయినవిల్లి, వానపల్లి పళ్లాలమ్మ తల్లి ఆలయ, పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి దర్శనాలు ఉంటాయన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకు రావులపాలెం, వాడపల్లి నుండి ఆల్ట్రా డీలక్స్ బస్సులు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరిగి రావులపాలెం చేరుకుంటారన్నారు. ఒక వ్యక్తికి రూ.460 టికెట్ ఉంటుందని, భక్తులు రావులపాలెం డిపో ఎంక్వైరీ 99592 25549, ఆర్ఎస్ రావు 73829 12398, టీసీహెచ్‌వీబీ 73829 12400 ఫోన్లలో సంప్రదించవచ్చునని ఆయన ప్రకటనలోతెలిపారు.


మహాలక్ష్మిగా మాణిక్యాంబ



శ్రీ మహాలక్ష్మి అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మాణిక్యాంబ అమ్మవారి మట్టి ప్రతిమకు శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణ చేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో మేలు కొలుపు, ప్రభాత సేవ, సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, తీర్థపు బిందె, బాలభోగం, ప్రధమాభిషేకం, ప్రధమార్చనల అనంతరం అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వచ్చే నెల 10 నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను అక్టోబర్ పదో తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జేసీ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి బ్రహ్మోత్సవాలు నిర్వహణ, భక్తుల భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సమన్వయంలో ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. రోజువారీ భక్తుల సంఖ్య వెయ్యి కంటే ఎక్కువగా ఉంటే దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు జిల్లా యంత్రాంగం సహకారాన్ని కోరాలన్నారు. వాహన సేవకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. వరద ఉధృతి సందర్భాలలో కేవలం షవర్ బాత్ ఏర్పాటు చేయాలన్నారు. అక్టోబర్ 4, 18వ తేదీల శనివారాలలో మందపల్లి శనీశ్వర స్వామి వారి శని త్రయోదశి పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కె.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, కొత్తపేట డీఎస్పీ మురళీ మోహన్ తహసీల్దార్లు రాజేశ్వరరావు, రాంబాబు, ఎంపీడీవోలు వెంకటరమణ, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు చండీహోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి గావించారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు, పరిచారకులు చిట్టెం వాసు, వేణు, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, తొలి పావంచా వద్ద కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు నరసింహమూర్తి ఆధ్వర్యాన పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాదులు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు.



దేవీచౌక్‌లో భక్తజనవాహిని



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బాలయై నమః

శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. దసరా వేడుకలకు ఎంతో ప్రసిద్ధి చెందిన రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గమ్మ తల్లి శ్రీ బాలాత్రిపురసుందరి అలంకారంలో శుక్రవారం దర్శనమిచ్చారు. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో త్రిశూలం ధరించి, సింహవాహనంపై ఆశీనురాలై.. భక్తుల రక్షణ తనదేనన్నట్టుగా దర్శనమిచ్చారు. అలాగే అంబాజీపేట మండలం మాచవరంలో వారాహి అమ్మవారిని గాజులతో ఆకర్షణీయంగా అలంకరించారు.

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/ అంబాజీపేట



అంబాజీపేట మండలం మాచవరంలో గాజుల అలంకరణలో వారాహి అమ్మవారు

మాజేటికి ఉత్తమ రైతు పురస్కారం

వరిసాగులో విశేష కృషికి ప్రశంసలు



ఉత్తమ రైతు అవార్డును అందుకున్న మాజేటి

యానాం: ఏరువాక మహోత్సవ్–2025 ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో యానాంకు చెందిన రైతు, వ్యాపారవేత్త, యానాం వర్తకసంఘం గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ ధాన్యం సాగులో ఉత్తమరైతు పురస్కారం అందుకున్నారు. విజయవాడలో శుక్రవారం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ గారా రాఘవరావు, ఎంఎస్ఎంఇ చైర్మన్ శివశంకర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రం అంతటా వివిధ వ్యవసాయ విభాగాల్లో ఉత్తమ శాస్త్రవేత్త, ఉత్తమ రైతు, ఉత్తమ జర్నలిస్ట్, ఉత్తమ సృజనాత్మక ఆలోచన తదితర విభాగాల్లో 34 మందిని ఎంపిక చేశారు. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా యానాం బ్లాక్ ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్స్ సొసైటీని స్థాపించి చైర్మన్‌గా రైతాంగ అభివృద్ధికి గత 25 ఏళ్లుగా ఆయన విశేష కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు అవార్డు రావడం పలువురు ప్రశంసించారు.

లక్ష్మీదేవి లక్షణంగా..

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని, ఆలయాన్ని రూ.4.42 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరించారు. పట్టణ వైశ్య సంఘం, ఆలయ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కరెన్సీ నోట్ల కట్టలు, రూ.5, రూ.10, రూ.20 నాణేలను అమ్మవారి సన్నిధిలో ప్రదర్శనగా ఉంచారు. వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అప్పన వీరన్న, గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య తదితరులు సేవలందించారు.

నల్లజర్ల: మండలం పోతవరంలో చావారామకృష్ణ వీధిలో విజయ కనకదుర్గమ్మ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి రూ.16 లక్షల విలువైన నోట్లతో అద్భుతంగా అలంకరించారు. వేదపండితులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ముమ్మిడివరం: మండలం శివారు గోదశివారిపాలెంలో అమ్మవారిని రూ.30 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు.


కరప: మండలం అరట్లకట్ట గ్రామంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మిగా దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు కొంతేటి సత్యనారాయణమూర్తి, కొంతేటి శివ, ఆలయకమిటీ, భక్త బృందం ఆధ్వర్యంలో అమ్మవారిని, ఆలయంలోని దేవతా మూర్తులను రూ 8 లక్షలు విలువచేసే కరెన్సీనోట్లతో అలంకరించారు.



రూ.4.42 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకృతమైన అమలాపురం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవి



గోదశివారిపాలెంలో రూ.30 లక్షలతో..



రూ.16 లక్షలతో పోతవరంలోని కనకదుర్గమ్మ..



అరట్లకట్ట శివాలయంలో భ్రమరాంబిక అలంకరణ రూ.8 లక్షలతో

క్లుప్తంగా

సంపద తయారీపై అవగాహన అవసరం



వర్మీ కంపోస్టు తయారీపై ఎంపీడీఓలకు అవగాహన కల్పిస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: సంపద తయారీ కేంద్రాలపై ఎంపీడీఓలకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణ కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, కె.శేషుబాబు, జగన్నాథం అన్నారు.

స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలు ఈ నెల 8వ తేదీ నుంచి శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా జి.రాగంపేటలోని వర్మీ కంపోస్టు యూనిట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈటీసీ టెక్నికల్ ఫ్యాకల్టీ ఎస్కే మోహిద్దీన్, రాగంపేట పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

దసరాల్లో అల్లల్లాచ్చికి..!

‘ఏరా.. హోంవర్క్ చేశావా.. లేదా.. గెటౌట్ ఫ్రం క్లాస్ రూం’.. ఓ పిల్లాడిపై మాస్టారి అరుపు. ‘ఏవండీ ఆ ఫైల్ రెడీ అయ్యిందా.. ఇంకా ఎంత సేపండీ ఫైవోక్లాక్‌కి జీఎంతో మీటింగ్ ఉంది.. స్పీడుగా కానియ్యండి’.. ఓ ఉద్యోగిపై ఆయన బాస్ అదిలింపు. ఏమేవ్.. లంచ్‌బాక్స్ రెడీ అయ్యిందా.. క్యాబ్ వచ్చేసింది..’ ‘ఆ.. ఇదుగో వచ్చేస్తున్నానండీ.. అయిపోయింది..’ ఓ భార్యాభర్తల ఉదయపు హడావిడి.. పొద్దున్న లేచింది మొదలు రాత్రి వరకు ఆ పనులవ్వకపోతే భూమి బద్దలైపోతుందన్నట్టు ప్రతి చోటా ఇవే అరుపులు కేకల జీవితం. ఏ ఉదయమూ మృదువైన సంభాషణలు మచ్చుకు కూడా వినపడని రోజుల్లోకి వెళ్లిపోయారు మనుషులు. ఆ ఉరుకుల పరుగుల జీవితాలకు రీచార్జింగే సెలవులు. ఎక్కడో బద్ధకిష్టులు తప్ప అత్యధికులు వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అటో.. ఇటో.. ఎటో పిల్లా పాపలతో బయటకు అలా అలా తిరిగొచ్చేవారే. ఇదిగో దసరా సెలవులొచ్చాయిగా.. మనవాళ్ల ప్రణాళికలేంటో చూసొచ్చేద్దామా..



హంపి విజయనగరం అందాలను కెమేరాలో బంధిస్తున్న పర్యాటకుడు



మైసూర్ బృందావన గార్డెన్స్‌లో మ్యూజికల్ లైటింగ్

- ఉరుకుల జీవితం నుంచి ఊళ్లకు సరదాగా
- కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి పర్యటనలు
- చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఉల్లాసంగా పయనం
- సెలవులు సద్వినియోగం

రాయవరం: జీవితం ఉరుకుల పరుగులమయమైంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు ఎన్నో ఒత్తిళ్లు.. ఆలోచనలు చుట్టుముట్టేస్తున్నాయి. పిల్లల పుస్తక పోరాటం మరీను. పాఠశాల.. అనంతరం హోంవర్క్ పేరుతో రాత్రంతా మేల్కొని ఉండడం. అందరికీ కాస్త విరామం దొరికేది సెలవుల్లోనే. ఉరుకుల పరుగుల జీవితానికి కాస్త విరామం ఇచ్చి ఓ మంచి ఆరామాన్ని ఎంచుకుని రిఫ్రెష్ అవ్వాలని చూస్తుంటారు. జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్లే వారు కొందరైతే, మరికొందరు, దేశ, విదేశాల్లో విహరించడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు 10 రోజుల పైబడి రావడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావాసులు ఎటువంటి ప్రదేశాలకు వెళ్తున్నారో ‘సాక్షి’ కథనం.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం కోసం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న ఎన్నో ఆలయాల్లో దైవ దర్శనాలు చేసుకోవడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతో పాటు మనసు కుదుట పడుతుందని పలువురు భావిస్తున్నారు. అలాగే ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే పాపికొండలు, మారేడుమిల్లి, రంపచోడవరం, సముద్ర తీరప్రాంతాలైన కాకినాడ, అంతర్వేది బీచ్ వంటి ప్రదేశాలతో పాటుగా, ఇతర జిల్లా, రాష్ట్రాల్లోని అరకు, నాగార్జునసాగర్, తమిళనాడు, కేరళ, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లోని ఆహ్లాదకర ప్రాంతాలను చుట్టి వచ్చేందుకు పయనమవుతున్నారు. ఇక రిజర్వేషన్లు సహకరిస్తే వారణాసి, అయోధ్య వంటి ప్రాంతాలకు కూడా ప్రణాళికలు వేసుకుంటున్నారు. మరికొందరు సింగపూర్, మలేషియా, శ్రీలంక, దుబాయ్, థాయ్‌లాండ్ వంటి దేశాలను చుట్టి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ముందుగానే ప్లాన్ చేసుకుంటాం



ఏటా దసరా, సంక్రాంతి, వేసవి సెలవులకు తప్పనిసరిగా టూర్ వెళ్తాం. ఓసారి ఆధ్యాత్మికం, ఓసారి ఆహ్లాదకర టూర్స్ చేస్తుంటాం. ఈసారి దసరా సెలవుల్లో ముంబై, పూణే ప్రదేశాలు చూసేందుకు వెళ్తున్నాం. మిత్రులతో కలసి పర్యాటక ప్రదేశాలు చూసేందుకు వెళ్తున్నాం. ఈ పర్యటనలతో ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగి మరింత ఉత్సాహంగా పనిచేయగలుగుతున్నాం.

– పితాని శ్రీనివాస్, టీచర్, జెడ్పీహెచ్ఎస్, కె.గంగవరం మండలం

కొత్త విషయాలను తెలుసుకుంటాం



ఏటా పర్యాటక ప్రదేశాలకు కుటుంబ సభ్యులతో వెళ్తుంటాను. వీటి ద్వారా పిల్లలకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచుతున్నట్లవుతుంది. కొత్త విషయాలను తెలుసుకుంటారు. తెలుసుకున్న విషయాలను పాఠశాలల్లో చిన్నారులకు ఫొటోలు, వీడియోలు చూపించి, అక్కడ విషయాలను తెలియజేస్తాను.

– నయనాల శ్రీనివాసరావు, స్కూల్ అసిస్టెంట్, వీరవల్లిపాలెం, అయినవిల్లి మండలం.

పర్యాటక వాహనాలకూ డిమాండ్

ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలను, ఇతర జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ఒక రోజులో సందర్శించి వస్తున్నారు. సొంత కార్లు ఉన్న వారే కాకుండా.. మరికొందరు రోజువారీగా అద్దె వాహనాలపై పర్యాటక ప్రాంతాల్లోని అందాలు చూసి వస్తున్నారు. మరికొందరు క్రూజ్ టూర్‌కు ఆసక్తి కనబరుస్తున్నారు. సముద్రంలో ఓడలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విశాఖపట్నం నుంచి చెన్నై, శ్రీలంక, అండమాన్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

చిక్‌మగుళూర్ వెళ్తున్నా



ప్రతిసారి సెలవులకు విహార యాత్రకు వెళ్లడం అలవాటు. గతంలో శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండం, ఒడిశాలోని కోణార్క్ టెంపుల్, కర్ణాటకలోని హంపి, బాదామి, పట్టడికల్ వంటి చారిత్రక ప్రదేశాలు తిలకించాం. ఈసారి దసరా సెలవులకు చిక్‌మగుళూర్ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి హిల్ స్టేషన్‌కు కారులోనే వెళ్తున్నాం.

– జానా సురేష్‌కుమార్, ఎస్‌జీటీ, వల్లాయిచెరువు, పెదగాదవిల్లి, ఉప్పలగుప్తం మండలం

బ్యాంకాక్ పర్యటన మరువలేనిది



మిత్రులతో కలసి చేసిన బ్యాంకాక్ పర్యటన సరికొత్త అనుభూతులనునిచ్చింది. అక్కడ సముద్రంలో అరగంట ప్రయాణించిన తర్వాత సముద్రం లోపల ఉన్న మ్యూజియంలో రకరకాల చేపలు చూసి ఆశ్చర్య పోవాల్సిందే. అలాగే బౌద్ధ దేవాలయాలు కూడా చూడ ముచ్చటగా ఉంటాయి. బోట్ రైడింగ్, వాటర్‌లో స్కై డైవింగ్ వంటి అంశాలు మరపురానివి.

– సాపిరెడ్డి విశ్వనాథ బాలాజీ (దొరబాబు), యర్రపోతవరం, కె.గంగవరం మండలం

రూ.3.8 లక్షల విలువైన ఆభరణాల చోరీ



కపిలేశ్వరపురంలో చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం: స్థానిక చప్పిడి శ్యామ్‌ప్రసాద్ ఇంటిలోని రూ.3.8 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అంగర పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు శ్యామ్ ప్రసాద్, ధనలక్ష్మి దంపతులు ఈ నెల 23న వేరే ఊరిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. బీరువా తెరిచి సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.2.5 లక్షల విలువైన 25 గ్రాముల బంగారం, రూ.1.3 లక్షల విలువైన 32 తులాలు వెండి అపహరించుకుపోయారు. బాధితులు ఫిర్యాదుపై మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై జి.హరీష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అమలాపురం నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



మనోహర్ (ఫైల్)

యానాం: పట్టణ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పునీత్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు మండలం పటవల, రాఘవేంద్రపురానికి చెందిన 25 ఏళ్ల పేరాబత్తుల మనోహర్ ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని సాపిరెడ్డి శివవరప్రసాద్ ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదృశ్యమైన మనోహర్ ఆ రోజు బైక్‌పై ఇంటినుంచి యానాం బాలయోగివారధి వద్ద దొడ్డి గంగమ్మ ఆలయం వద్దకు వచ్చాడని అప్పటి నుంచి ఆయన కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వివరాలు తెలిసిన వారు యానాం ఎస్సైకి 0884-2324800, 2321 210 నంబర్‌లో తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

వెదురు సాగు లాభదాయకం



ప్రాంతీయ అటవీ పరిశోధనా కేంద్రంలో పెంచుతున్న వెదురు రకాలను పరిశీలిస్తున్న చౌడప్ప

రాజానగరం: వెదురును సాగు ద్వారా ఎకరానికి రూ.ఒక లక్ష ఆదాయాన్ని పొందవచ్చని సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీపీసీఆర్ఐ) విశ్రాంత సంచాలకుడు పి.చౌడప్ప అన్నారు. లాలా చెరువు సమీపంలోని ప్రాంతీయ అటవీ పరిశోధన కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, అక్కడ పెంచుతున్న వివిధ రకాల వెదురు జాతుల మొక్కలను పరిశీలించారు. వెదురు మొక్కలను బయోచార్ ప్రిపరేషన్, అగర్‌బత్తీల తయారీ వంటి విభిన్న రంగాలలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారన్నారు. జిల్లా ఉద్యాన విభాగం అధికారి ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ వెదురు సాగు చేసే రైతులకు పలు రకాల సబ్సిడీలు ఉన్నాయన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే పంటగా ఈ సాగు ఎంతో అనువైనదని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారి కొవ్వూరు సుధీర్, మండల శాఖ అధికారి నాగదేవి, వేణుమాధవ్, అటవీ శాఖ రేంజర్ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న ఫ్యాన్సీ దుకాణం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేసీ త్రినాథరావు, ఈఓ సుబ్బారావు

- ఫ్యాన్సీ దుకాణం గోదాములో ఘటన
- రూ.పది లక్షల ఆస్తి నష్టం
- ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమంటున్న అధికారులు

అన్నవరం: రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద గల ఫ్యాన్సీ షాపు గోడౌన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే ఫ్యాన్సీ షాపు నిర్వాహకుడు దాని వెనుక గోడౌన్ ఏర్పాటు చేసుకుని ప్లాస్టిక్ వస్తువులు, ఫొటోలు, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లు పెట్టుకున్నాడు. ఉదయం ఏడు గంటల సమయంలో ఆ గోడౌన్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి వస్తువులు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో 8 ఫ్రిజ్‌లతో సహా సుమారు రెండు లారీల సరకు కాలి బూడిదైంది. సకాలంలో ఫైర్ ఇంజిన్ రాకపోయి ఉంటే షాపింగ్ కాంప్లెక్స్‌కు మంటలు వ్యాపించి రూ.కోట్లలో నష్టం వాటిల్లేదని స్థానికులు చెప్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ విషయం తెలియగానే దేవదాయశాఖ ఆర్‌జేసీ వి.త్రినాథరావు, పెద్దాపురం ఆర్డీఓ రమణి వచ్చి ఆ గోడౌన్‌ను పరిశీలించారు. ప్రమాద వివరాలను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు వారికి వివరించారు.

సందడి చేసిన ‘అనగనగా ఒక రాజు’

జి.మామిడాడలో పోలిశెట్టి నవీన్ చిత్రం షూటింగ్

పెదపూడి: జి.మామిడాడలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. హీరో పోలిశెట్టి నవీన్ హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సితార ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో అనగనగా ఒక రాజు సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. ఈ సినిమాకు మారి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన జాతిరత్నాలు చిత్రానికి ఆయన రైటర్‌గా పనిచేసి తొలిసారి ఈ చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. మూడురోజులుగా ఎల్ఎస్‌పురంలో ఈ షూటింగ్ సాగుతోంది. జబర్దస్త్ ఆర్టిస్టులు చమ్మక్ చంద్ర, భద్రం, మహేష్, రోహిణీ, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌గా నవీన్ (రాజు) ఓట్లు అభ్యర్థించే సన్నివేశాలు, ఎన్నికల ప్రచారంలో భాగంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడే సన్నివేశాలను చిత్రీకరించారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి.



హీరో పోలిశెట్టి నవీన్‌పై చిత్రీకరిస్తున్న సన్నివేశం

నన్నయలో రేపు అంతర కళాశాలల కబడ్డీ పోటీలు

పెదపూడి: జి.మామిడాడ డీఆర్‌కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆదేశాల మేరకు ఈ నెల 28న యూనివర్సిటీ కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 3న కర్ణాటక రాణి చెన్నమ్మ యూనివర్శిటీ బెల్గవిలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ ఎంపికలో ఉభయ గోదావరి జిల్లాల కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. వివరాలకు పోటీల విభాగం కన్వీనర్ వెంకటరెడ్డిని 89190 98439 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

29న నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు నిధి ఆప్‌కే నికట్–డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో ద్వారకాతిరుమలలో శ్రీ సర్వారాయ షుగర్స్ లిమిటెడ్, బాట్లింగ్ యూనిట్‌లోను, పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు సంధ్య మెరైన్స్‌లోను, కాకినాడ జిల్లాలో తుని శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో యానాం అడవిపాలెంలోని వాసవీ పిగ్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోను, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వెంకటాపురంలోని జీఎస్ఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీలోను, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పట్నాయక్ తెలిపారు. ‘ఈపీఎఫ్ఐ ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ’, ఇతర ఫిర్యాదు దాఖలు నిబంధనలు, క్లెయిమ్ తిరస్కరణ కారణాలు, స్కీమ్ సర్టిఫికెట్ ప్రయోజనాల వంటి అంశాలను వివరించడం, పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎగ్జంప్టెడ్/నాన్-ఎగ్జంప్టెడ్), కొత్తగా కవర్ చేయబడిన ఎస్టాబ్లిష్మెంట్‌లకు చెందిన వారు తమ ఫిర్యాదులను ‘నిధి ఆప్ కే నికట్’ అని పేర్కొంటూ సమర్పించవచ్చునని తెలిపారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ బకాయి ఉన్న పింఛనుదారులు ఈ శిబిరంలో సమర్పించవచ్చునని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు.

వరకట్నం వేధింపులతో చంపేశారు

రాజానగరం: తన కుమార్తెను అత్తింటి వారు వరకట్నం కోసం తరచు వేధించడమే కాకుండా ఆమెను నిర్దాక్షిణ్యంగా చంపేశారని పాయకరావుపేటకు చెందిన షేక్ వలీ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక ఎస్సై జీవీవీ సత్యనారాయణ శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాలివి. మండలంలోని పాత నామవరానికి చెందిన సయ్యద్ బషీరుద్దీన్‌కు షేక్ వలీ దంపతులు తమ కుమార్తె సయ్యద్ హీరా (22)తో ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా హీరా భర్త బషీరుద్దీన్, అత్తమామలు సయ్యద్ హమ్ముదున్నీసా, బాజీలు తిట్టడం, కొట్టడం చేస్తుండేవారు. గత ఆదివారం తమ కుమార్తెను చూసేందుకు వచ్చిన తల్లికి అత్తింటి వారు పెడుతున్న హింసల గురించి చెప్పి ఏడ్చింది. అయినప్పటికీ సర్దుకుపోవాలని తన కుమార్తెను ఓదార్చి ఆమె వెళ్లిపోయింది. కాగా శుక్రవారం ఆమె చనిపోయింది. ఈ విషయం తెలుసుకుని పాతనామవరం వచ్చిన మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆమె మరణం సహజమైనది కాదని, అత్తింటి వారే చంపి ఉంటారని అనుమానాన్ని వ్యక్తపరుస్తూ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

పేద మహిళకు ఉచితంగా శస్త్ర చికిత్స

సత్య సాయి సేవా సంస్థల రూ.58 వేల వితరణ

అమలాపురం టౌన్: సత్యసాయి సేవా సంస్థలు ఓ పేద మహిళకు హిస్టరెక్టమీ శస్త్ర చికిత్సను ఉచితంగా నిర్వహించే ఏర్పాట్లు చేసింది. అమలాపురం డివిజన్ సత్య సాయి సేవా సంస్థలు భగవాన్ సత్య సాయిబాబా అవతార శతాబ్ది మహోత్సవాల సందర్భంగా 100 గ్రామ సేవల నిర్వహణలో భాగంగా రూరల్ మండలం పాలగుమ్మి శివారు కంభంపాడులో బుధవారం సేవా కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన సరెళ్ల బేబీ కడుపులో కంతి పెరిగి నొప్పి, రక్త స్రావంతో బాధ పడడాన్ని సేవకులు గుర్తించారు. దానిని తొలగించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో సేవా సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ రూ.58 వేల ఆర్థిక సాయం చేశారు. దీంతో అమలాపురంలోని శ్రావణి ఆస్పత్రిలో డాక్టర్ శ్రావణి కేవలం శస్త్రచికిత్సకు అయ్యే రూ.48 వేలను మాత్రమే తీసుకుని ఆమెకు చికిత్స చేశారు. ప్రస్తుతం బేబీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ ప్రభాకర్ తెలిపారు.



శస్త్ర చికిత్స అనంతరం క్షేమంగా ఉన్న బేబీకి పొరుగింటి మహిళకు రూ.58 వేల నగదు అందజేస్తున్న సత్య సాయి సేవా సంస్థల డివిజన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్

యువకుడి అదృశ్యం



తోట సత్యనారాయణ

పెరవలి: మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన తోట వెంకట సత్యనారాయణ ఈ నెల 25 తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడు. అతడి తల్లి భవాని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సత్యనారాయణ తణుకులోని ఒక ప్రేవేట్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడని, 25 తేదీన సాయంత్రం 5 గంటలకు ఆసుపత్రికి వెళ్లి వస్తానని తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సత్యనారాయణ ఆచూకీ తెలిసిన వారు 94407 96642 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.